




# ఏ.మొ....ఏమో

## అమెరికాకమ్మ కథలు- 7

నా చిన్నప్పుడు మా ఇంట్లోనూ, బంధువుల్లోనూ ఇంచుమించు అందరూ, స్కూల్లో కొందరూ, ఈ రెండూ కానివాళ్ళలో మరికొందరూ, అందరూ కలిసి నా గురించి "ఈ వెధవ తెలివైనవాడే " అనుకునే వారు. నేనూ ఆ మాట విని ఎవరూ చూడనప్పుడు కాలర్ ఎత్తుకునేవాణ్ణి. ఎందుకంటే ఎవరైనా చూస్తుండగా కాలర్ ఎత్తుకుంటే అందరూ ఆ అభిప్రాయాన్ని అర్జంటుగా మార్చేసుకుని "ఈ వెధవకి పొగరు" అనుకుంటారేమో అని భయం వేసేది. ఏది, ఎలా చూసినా, నా గురించి ఎవరు మాట్లాడినా, ఎటువంటి అభిప్రాయం వెలిబుచ్చినా ఆ "వెధవ" అనేమాట ఎందుకువాడేవారో నాకు ఇప్పటికీ అర్థం అవదు.

నాకు తెలిసిన మరొక విషయం ఏమిటంటే, నేను తెలివైన వాడినయినా కాకపోయినా , అదొక్కటీ నాకు ఏనాడూ సాధ్యపడలేదు. నేను మా మిత్రులందరికీ చెప్పేవాడిని "అదొక్కటీ అడక్కు" అని. ఇటీవలే ఆ పేరుతోటే ఒకానొక తెలుగు సినిమా వచ్చిందని విన్నాను కానీ సినిమా టైటిల్స్‌లో "టైటిల్ పెట్టిన వెధవ" అని నా పేరు వెయ్యలేదు అని తెలిసి ఆ సినిమా చూచుటకు నిరాకరించితిని. ఎందుకంటే కథ ఎంత చెత్తగా ఉన్నా, చూపులకు సుందరాంగిలా ఉన్నా తెలుగు ఎంత ఘోరాతిఘోరంగా మాట్లాడే హీరోయిన్ పేరూ, మరియు అంతకంటే ఘోరాతిఘోరంగా పాడే గాయకుల పేర్లు అన్ని ప్రకటనలోనూ, ఇంటర్నెట్లోనూ ఫొటోలతో సహా గుప్పించి పారేస్తున్న నిర్మాతలు నేను పుట్టగానే పరిమళించిన తెలివితేటలతో, భావి సినిమా టైటిల్‌ని సృష్టించిన నా పేరు ఎక్కడా గుర్తించకపోవడం కించిత్తు విచారకరమే కదా! అదొక్కటీ ఏమిటంటే ఏ.మొ పెట్టడం.

అసలు విషయం ఏమిటంటే, తెలివితేటలు ఉండడానికీ, ఫేసులో ఫీలింగులు పెట్టడానికీ ఎక్కడా పొంతన లేదు. అనగా, నాలాంటి బ్రిలియంట్ ఫెలోస్ కూడా, మొహం ఎలా కావాలంటే అలా పెట్టలేరు. బుర్రలో కేవలం ఇసుక, మట్టి పదార్థమూ ఉన్నవాళ్ళు కూడా మొహం మటుకు ఎలా కావాలంటే అలా మార్చగలరు. అందుకే వాళ్ళు సినీ నటులు అవగలరు. అమెరికాలో తంటా, జట్కా మరియు అమెరికడ్డీ సంఘాలలో ఉన్న బ్రిలియంట్ ఫెలోస్ వాళ్ళని ఆరాధించి, పూజించగలరు. నేను కూడా ఆ ఆరాధనం డిపార్ట్‌మెంట్‌లో అప్పుడప్పుడూ డప్పు వాయిస్తాను.

నా కేసులో నాకూ అక్కినేని, ఎన్టీర్, సావిత్రి, మరియు అల్లు రామలింగయ్య మరియు రాజబాబు వగైరాలకీ ఉన్న కామన్ విషయం మా సుందరవదనారవిందము అనియూ అని అందరూ ఒప్పుకునేదే ఎటొచ్చీ వాళ్ళందరూ మహానటులు. ఎందుకంటే నా అవగాహనలో మామూలు నటులకీ, మహానటులకి ఉన్న తేడా ఒకటే. వికటాట్టహాసము చేయుట, గంభీరముగా మొహం పెట్టుట, వెకిలిగా నవ్వుట, కాళ్ళూ, చేతులూ విరిగేలా స్టెప్పులు వేయుట, అతివేగముగా హీరో లేదా హీరోయిన్ వెనకాల మరియూ పక్కనా పరిగెట్టి - ఆరంగుళముల దగ్గరకు రాగానే అరంగుళములము దగ్గరలోనే ఉన్న పుష్పమును చుంబించుటా వగైరా చిల్లర నటనంతా మామూలు నటులే

చెయ్యగలరు. కేవలం తాము భోరుమని ఏడ్చుటయే కాక, సినిమా చూసిన తెలుగువారందరినీ వారం రోజులపాటు ఏడిపించినవారే మహానటులవుతారు కదా!

నేను మటుకు చిన్నప్పటినించీ ఎక్కువ అవస్థపడకుండానే న.మొ, వె.మొ, మరొక వె.మొ, పి.మొ వగైరాలన్నీ అలవోకగా పెట్టగలిగేవాణ్ణి. నాలుగువారాలక్రితం దాకా ఎంత ప్రయత్నం చేసినా ఏ.మొ మటుకు పెట్టలేక పోయాను. ప్రయత్నం చేసినప్పుడల్లా నా మొహం కో.మొ వలె వచ్చి చచ్చెను. అందువలన స్టేజి మీద నేను నటిస్తుండగా చూసిన ఆడియన్స్ అందరూ నవ్వితిరి కానీ భోరుమని కన్నీరుకార్చి, సారీ... కార్చకుండా నన్ను మహానటుల కోవలోకి వెళ్ళకుండా అడ్డుపడ్డారు.

కానీ, శుభవార్త ఏమిటంటే గత నాలుగైదు వారాలలో హైదరాబాదులోని వేగేశ్న ఫౌండేషన్ అనే వికలాంగుల సంక్షేమ సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా "ఘంటసాల రాధనోత్సవాలు-2009 " పేరిట మేము నిర్వహిస్తున్న విరాళాల వేటలో నేను ఏ.మొ పెట్టే అవకాశాలూ నాలుగైదు అనుకోకుండానే వచ్చాయి. ఏ.మొ కాదు.. ఏమో.... నిజంగానే మహానటుణ్ణి అవుతానేమో !

ఉదాహరణకి ఇప్పటిదాకా గత ఐదువారాలగా అమెరికాలో ఇరవై ఒక్క నగరాలలో ఘంటసాల పాటల కార్యక్రమం మొదలుపెట్టాక ప్రేక్షకులందరూ మైకంలో ఉండగా అర్జంటుగా ఆపేస్తాం. అలా ఆపేసి, గత ఇరవైఏళ్ళగా వేగేశ్న ఫౌండేషన్ వారు రోడ్డుమీద అడుక్కుంటున్న బీద వికలాంగులని ఏ విధంగా వైద్యం చేయించి, చదువు చెప్పించి, నూతన జీవితాన్ని ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న విషయాల మీద పదిహేను నిమిషాల వీడియో చూపించాం. తరవాత నేనూ, వేగేశ్న ఫౌండేషన్ సంస్థాపకులైన వంశీ రామరాజు గారూ కాస్సేపు మాట్లాడి "అమ్మలారా, అయ్యలారా, మా సంస్థకి మీకు తోచిన విరాళాలు ఇచ్చి పుణ్యమూ, పురుషార్థమూ, మరియు టాక్స్-డిడక్షనూ సంపాదించుకోండి, ప్లీజ్" అని బతిమాలి మాకు కేటాయించిన బల్ల దగ్గరకి పోతాం. మళ్ళీ పాటల కార్యక్రమం మొదలవుతుంది. నేను కూచున్న బల్ల మీద "ఇక్కడ విరాళములు పుచ్చుకోబడును" అని రాసి ఉండదు కానీ అక్కడే ఉంది అసలు రహస్యం. ఎందుకంటే నేను అక్కడ అఖండమైన ఫీలింగుతో "ఏ.మొ" పెట్టుకుని కూచుంటాను. ఏ.మొ అనగా "ఏడుపు మొహం" అని ఈ పాటికి మీకు అర్థం అయే ఉంటుంది. ఈ ఏ.మొ పెట్టుటకు కారణం ఏమిటంటే, నేను నా "నేటురల్ స్టేట్" లో "బీద వికలాంగులకు విరాళాలు పుచ్చుకోబడును" అనే బల్ల దగ్గర కూచున్నాననుకోండి. చిన్నప్పటినించీ ఉన్న నా అలవాటు ప్రకారం హాయిగా నవ్వుతూ, కులాసాగా ఉండే నా న.మొ మరియు న.మో చూసి నా జేబులో ఉన్న డబ్బులు కొట్టెయ్యాలని చూస్తారు కానీ, విరాళాలు ఎవరిస్తారూ? అందుచేత ఆ బల్ల దగ్గర కూచున్న రెండుగంటలూ నా మొ. లో ఫీలింగులు మార్చి ఏడుపు మొహం అభినయించక తప్పలేదు. ఆ విధంగా నాకు మహానటుడు అయ్యే అవకాశం అనుకోకుండా వచ్చింది.

అప్పుడప్పుడు కొంచెం మామూలు న. మొ వచ్చేసినా, ఫీలింగులు మళ్ళీ మార్చుకుని ఏ.మొ పెట్టే అవకాశం మరొక పద్ధతిలో వచ్చేది. ఉదాహరణకి, ఇంచుమించు అన్ని ఊళ్ళలోనూ పది, పదిహేనుమంది మా బల్ల దగ్గరకి వచ్చి "మీరేనా ఫలానా?" అని అడిగి "అవును, నేనే ఫలానా" అని నా సమాధానం వినగానే "మీ రాతలు చదువుతూ ఉంటాం. అసలు మిమ్మల్ని చూడడానికే మేము ఇక్కడకి వచ్చాం. క్వీన్ విక్టోరియా గారు ఎక్కడా? ఆవిడతో ఫొటో తీసుకోవచ్చా?" అని ఉక్కిరిబిక్కిరి అయిపోయేవారు. నేను ఏడవాలో, నవ్వాలో తెలియక వె.మొ పెట్టేవాణ్ణి. అంతియునే కాక ఆడియన్స్‌లో ఉన్న వందమందిలో కేవలం పది శాతమే నా రాతలు చదివితే మిగిలిన తొంభైమందికీ నేను అనామకుడికిందే లెక్క కదా అని విచారం వచ్చేది. అందువలన, అరక్షణం పాటు నేను న.మొ పెట్టినా మరుక్షణమే ఏ.మొ లోకి వెళ్ళిపోయేవాణ్ణి. మరొక ఊళ్ళో ఒకాయన స్టేజి మీద నా పేరు విని, నేను మా బల్ల దగ్గర ఏ.మొ తో కూచుని ఉండగా గబ, గబా వచ్చేసి, నా చేతులు పట్టుకుని 'సార్, రెండేళ్ళ క్రితం ఒక సారీ, అంతకు ముందు నాలుగు సార్లు మీరు రాసిన ఫలానా

నాలుగు నాటకాలు ఈ ఊళ్ళో వేశాం సార్. అఫ్ కోర్స్, మా ఊరి వాళ్ళకి తగ్గట్టు మీ నాటకాలని కంప్లీట్‌గా కస్టమైజ్ చేసి, ఇంప్రూవ్ చేశాం. అన్నీ మెగా హిట్టే. ఆడియన్స్ నవ్వలేక చచ్చారు" అని మహదానందపడిపోయాడు. చెప్పొద్దూ, ఈ మహానటుడు నాకు ఒక్క మాట కూడా చెప్పకపోయినా నా నాటకాలు వేశాడు కదా అని సంతోషించవలయునా, లేక నా నాటకాలని పూర్తిగా మార్చి పారేశి వేసిన వలనే అవి మెగా హిట్టయి, ఆడియన్స్ నవ్వలేక చచ్చితిరనియూ, యధాతథంగా వేసినయడల అదే ఆడియన్స్ ఏడవలేక చచ్చుండేవారు అనియూ అతని డైలాగుల తాత్పర్యమా అని నేను మళ్ళీ ఏడవాలో, నవ్వాలో తెలియక అరక్షణం పాటు నేను న.మొ పెట్టినా మరుక్షణమే ఏ.మొ లోకి వెళ్ళిపోయాను.

ఇలాగ ఎన్ని రకాలుగా చూసినా నాకు ఏ.మొ అభినయంలో గత నాలుగైదు వారాలగా అఖండమైన అనుభవం వచ్చేసింది. ఇక నేను మహానటుడు అవడానికి ఆడియన్స్ కూడా నాతో భోరుమంటే చాలు....

"ఎక్కడ ఉన్నావూ?" క్వీన్ విక్టోరియా ఫోన్.

"ఇంకెక్కడా, ఫలానా ఎయిర్‌పోర్ట్‌లో"

"రియల్లీ గుడ్ న్యూస్, అఫ్ కోర్స్ నువ్వు వింటే ఏ.మొ పెడతావనుకో. బట్ ఐ లైక్ యు దట్ వే"

" వాట్ డు యు మీన్" అమెరికా పద్ధతిలో ఇద్దరం ఇంగ్లీషులో మాట్లాడేసుకుంటున్నాం.

"యూసీ, కొంతమంది న.మొ పెట్టినా ఏ.మొ లాగానే ఉంటారు. మరికొంత మంది ఏ.మొ పెడితేనే బావుంటారు. నువ్వు రెండో కేటగిరీ".

"ఇంతకీ అసలు సంగతి ఏమిటీ, ఫ్లైట్ టైం అయిపోతోంది"

"ఇప్పుడే మంచి ఫోన్ కాల్ వచ్చింది"

"ఎవరి దగ్గరనుంచీ?

"ఇంకెవరూ? ఆకాశవాణి"

"ఇంత రాత్రి ఎందుకుటా అంత అర్జంటూ?

"ఎందుకేమిటీ, మంచి వార్త చెప్పింది"

"ఏమిటో అంత మంచి వార్త?"

"ఏముందీ , నువ్వు ఊళ్ళు పట్టుకు తిరుగుతున్నావు కదా, ఈ నెల నీ ఆర్టికిల్ ఇంకా పంపించలేదుగా. ఎడిటర్ గారికి నువ్వెక్కడున్నావో తెలియక 24 గంటలు నోటీస్ ఇచ్చారుట. అంటే ఆ లోపుగా నీ ఆర్టికిల్ చేరకపోతే నీ జన్మంతా ఏ.మొ. నా జన్మంతా న.మొ....ఓచ్. "

"వాటీజ్ దిస్, ఏ.మొ అండ్ న.మొ? అన్నాను.

"ఇదిగో, ఇప్పుడు నువ్వు పెట్టినది వె.మొ...అనగా వెర్రి మొహం. ఏ.మొ అనగా నెక్స్ట్ స్టేజ్ అనగా ఏడుపు మొహం. న.మో అనగా నవ్వు మొహం...' ఎట్సెటరా.

వెంఠనే ఐడియా వచ్చేసింది. గంటలో రాసి పారేసి వైఫై లో పంపిస్తాను. ఎడిటర్ గారికి సకాలంలో అందుతుందో లేదో? అందినయడల, ఇది చదివిన పిమ్మట వారి న.మో...అనగా నగుమోము ఏ విధంగా మారునో నా బ్రిలియంట్ బుర్రకి కూడా తట్టటం లేదు.

ఇందులో ఒక వె.మొ అనగా వెర్రి మొహమూ, మరొక వె.మొ అనగా వెకిలి మొహమూ, కో.మొ అనగా కోతి మొహమూ, పి.మొ అనగా పిచ్చి మొహమూ అని మొహములు పరి పరి విధములుగా ఉండునని గ్రహించగలరు.

***